క్లుప్తంగా

పనిముట్లపై విజిలెన్స్ అధికారుల తనిఖీ



వ్యవసాయ పనిముట్లను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మద్దిపాడు: మండలంలోని రాచవారిపాలెం, కీర్తిపాడు, గుండ్లాపల్లి, దొడ్డవరం, ఘడియపూడి, మల్లవరం, కొలచనకోట గ్రామాల్లో 2018లో రైతు సేవా కేంద్రాల ద్వారా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ పథకంలో రైతు గ్రూపులకు యంత్ర పరికరాలు, ట్రాక్టర్ సబ్సిడీపై ఇచ్చారు. ఈ నేపథ్యంలో సదరు పరికరాల తనిఖీ నిమిత్తం, బ్యాంకు లోనుకు సంబంధించిన వివరాలను విజిలెన్స్ అధికారులు విజిలెన్స్ ఏవో ప్రసాద్, విజిలెన్స్ కానిస్టేబుల్ చెన్నకృష్ణ తనిఖీలను చేపట్టారు. కార్యక్రమంలో ఏవో అధికారి కే .రమేష్ బాబు ఆయా గ్రామాలకు చెందిన రైతు సేవకులు పాల్గొన్నారు.

వైభవంగా శిఖర కలశ ప్రతిష్ఠ

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామస్వామి ఆలయంలో శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చనలు, హోమాలు, గ్రామోత్సవం ఘనంగా సాగాయి. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

బేస్తవారిపేట: పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జక్కం మెర్సీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీలుగలు 10 కిలోలు రూ.1230 కాగా సబ్సిడీ రూ.615, జనుములు 10 కిలోలు రూ.1090 కాగా సబ్సిడీ రూ.545, పిల్లి పెసర 8 కిలోల విత్తనాలు రూ.1440 కాగా రూ.720 సబ్సిడీ వర్తింస్తుందని వివరించారు. జనుము, జీలుగ, పిల్లి పెసర మూడు రకాల విత్తనాలు 10 కేజీల ప్యాకెట్ రూ.1296 కాగా రాయితీపై రూ.648కు అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

అర్ధవీడు గురుకులానికి రెండు అవార్డులు

బేస్తవారిపేట(అర్ధవీడు): స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు రెండు అవార్డులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో నూరు శాతం ఫలితాలు సాధించడంతో రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్కూల్ అవార్డు, బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాలల్లో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థి పి.కోటేశ్వరరావు 576 మార్కులతో బెస్ట్ స్టూడెంట్ అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల, పాఠశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

20న జాతీయ సమ్మెకు నోటీసులు అందజేత

గిద్దలూరు రూరల్: ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో మెప్మా అధికారి ప్రసాద్‌కు ఆర్పీలు మంగళవారం నోటీసులు అందజేశారు. సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నామని ఆశా వర్కర్లు డాక్టర్ భార్గవ్‌రెడ్డికి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్ అమలు తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

వేడుకగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మతల్లి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వాస్తు సిద్ధాంతి, ప్రతిష్ఠాచార్యులు పండిత దైవజ్ఞశర్మ ఆధ్వర్యంలో కంకణధారులతో హోమాలు నిర్వహించారు. రాత్రికి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పౌరాణిక నాటకం ఏర్పాటు చేశారు. బుధవారం పూజలతోపాటు విగ్రహాల గ్రామోత్సవం, రాత్రికి విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని మంగళవారం వెండి చీరతో ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం వాసవీ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, రామడుగు రమేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నేటితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

పశువులకు వడదెబ్బ ముప్పు

- అప్రమత్తత అవసరమంటున్న అధికారులు
- పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ ప్రతాప్‌రెడ్డి సూచనలు
- మండలంలో 11400 ఆవులు, 3400 గొర్రెలు



పశువుల కోసం పాడి రైతు ఏర్పాటు చేసుకున్న షెడ్డు



బొమ్మిరెడ్డి ప్రతాప్ రెడ్డి

సంతనూతలపాడు: వేసవిలో మనుషులే ఎండ దెబ్బకు అల్లాడిపోతుంటే.. ఇక మూగజీవాల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పశువులకు వడదెబ్బ ముప్పు పొంచి ఉంది. ఎండ తీవ్రత కారణంగా పశువులు వడదెబ్బ బారిన పడే ఆస్కారం అధికంగా ఉందని.. పశుపోషకులు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని సంతనూతలపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ బొమ్మిరెడ్డి ప్రతాప్ రెడ్డి సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు, చికిత్స..

ఆవుల్లో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల సెల్సియస్ మించుతుంది. చర్మం మృదుత్వం తగ్గిపోయి గట్టిపడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంట చొంగ కారడం జరుగుతుంది. ఆవులలో పాల దిగుబడి, పునరుత్పత్తి, చూడుకట్టే శాతం తగ్గి గర్భస్రావం అయ్యే అవకాశం ఉండగా, ఎద్దులో వంధ్యత్వం వస్తుంది. తీవ్రత ఎక్కువ అయినప్పుడు పక్ష వాత లక్షణాలు సంభవించి క్రమంగా కోమాలోకి వెళ్లి మరణిస్తాయి. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే నీడ ప్రాంతానికి మార్చి వీలైతే ఫ్యాన్లు లేదా కూలర్ల సాయంతో చల్లని గాలి అందించాలి. బాగా ఎండగా ఉన్న సమయాల్లో పశువులను చల్లని నీటితో పలుసార్లు కడగాలి. చల్లని నీరు తాగడానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి నివారణ (అనాల్జెసిక్) మందులను వాడాలి. రక్తంలోకి డెక్స్ట్రోజ్ సెలైన్, లవణ ద్రావణాలు ఎక్కించాలి.

వడదెబ్బ నుంచి పశువుల సంరక్షణ..

వేసవిలో పశువులు వడదెబ్బ బారిన పడకుండా గంటకు ఒకసారి పశువులను నీటితో తలతో సహా తడపాలి. తాగునీటికి ఉపయోగించని కుంటల్లో పశువులను వదలాలి. నీటి వసతి ఉన్న పాడి రైతులు రోజుకు నాలుగైదు సార్లు పశువులను నీటితో తడపాలి. వేడిగాలి తగలకుండా పశువుల పాక చుట్టూ గోనె సంచులు కట్టి వాటిని నీటితో తడుపుతుండాలి. పశువుల పాకల్లో తుంపర్లను చిమ్మే నీటి పైపులను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసిన తొట్టి నుంచి చిన్న మోటారు సాయంతో నీటిని పైపుల ద్వారా తుంపర్ల రూపంలో వదలాలి. పశువుల పాకకు సమీపంలో భవనంపై నీటి తొట్టిని ఏర్పాటు చేసుకొని వాటిని పైపులతో పశువుల పాకలోకి అమర్చి స్ప్రింక్లర్లతో మోటారు లేకుండా నీటిని చల్లవచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఎండ తగ్గే వరకు రెండు గంటలకోసారి పది నిమిషాల పాటు నీటిని చల్లాలి. పశువులకు వడదెబ్బ తగిలితే వెంటనే దగ్గరలోని పశువైద్యాధికారిని సంప్రదించాలి. వేసవిలో పశువులను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య మేతకు వదలకూడదు. తాగేందుకు చల్లని తాగునీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలి. కొట్టాలను బాగా ఎత్తుగా నిర్మించుకుని పైన ఎండుగడ్డితో కప్పి ఎండగా ఉన్న సమయాల్లో దాని మీద నీళ్లు చల్లుతుండాలి. పశువుల పాకల్లో వడగాలి వస్తున్న దిక్కుల్లో గోనె సంచులు కట్టి నీళ్లు చల్లుతుండాలి. నీటి శాతం ఎక్కువగా ఉన్న మేపు (పచ్చిగడ్డి, పాతరగడ్డి, హైడ్రోఫోనిక్స్) గడ్డి పెట్టాలి. మరీ ఎక్కు వగా దాణా, ఉడికించిన ధాన్యాలు పెడుతున్నపుడు కొంచెం వంట సోడా కలపడం వల్ల ఎండవేడిమికి గురైన పశువుల్లో వచ్చే అజీర్తి సమస్యలను నివారించవచ్చని ఆయన చెప్తున్నారు.

పోలీసులు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి



టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్

- జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు సిబ్బంది మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉండాలని నిరంతరం ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు తగిన శ్రద్ధ చూపాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆధునికీకరించిన టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడికి గురయ్యే సిబ్బందికి శారీరక, మానసిక ఉల్లాసం ఎంతో ముఖ్యమన్నారు. టెన్నిస్ కోర్టు పోలీసు సిబ్బంది విరామానికి ఉపయోగపడుతుందని చెప్పారు. దీనివలన సిబ్బంది, అధికారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ రాఘవేంద్ర, ఆర్ఐలు రమణా రెడ్డి, సీతారామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు

- నేటి నుంచి ప్రారంభం



మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ గాలిగోపురం

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లవరం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం రాత్రి 8 గంటలకు అంకురారోహణము నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహిస్తారు. ధ్వజారోహణ సమయంలో సంతానంలేని వారికి గరుడ ప్రసాదం ఆలయ అర్చకులు అందిస్తారు. రాత్రి శేషవాహన సేవ, శుక్రవారం రాత్రి 8 గంటలకు హంసవాహన సేవ, 10వ తేదీ శనివారం రోజున సింహవాహన సేవ, 11వ తేదీన హనుమద్వాహన సేవ, 12వ తేదీ ఉదయం ఉత్సవ మూర్తులకు విశేష స్నపన, సాయంత్రం మోహినీ ఉత్సవం, రాత్రికి గరుడ సేవ, 13వ తేదీ రాత్రికి గజోత్సవ సేవ, 14వ తేదీ ఉదయం స్వామి వారి కల్యాణ మహోత్సవం కల్యాణానంతరం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రికి రథోత్సవం ఉంటుంది. 15వ తేదీన అశ్వవాహనం, 16వ తేదీ ఉదయం పుణ్యాహం, నిత్యహోమం, బలిహరణ, ఆశ్వవాహన ఉత్సవ అనంతరం చోర సంవాదం రాత్రి 8 గంటలకు శాంతి హోమం, ధ్వజారోహణ, పూర్ణాహుతి, 17వ తేదీ ఉదయం 8 గంటలకు చక్రతీర్థం, రాత్రి 8 గంటలకు స్వామివారి ఏకాంత సేవ కాగడా సేవలు ఉంటాయని, యాజ్ఞీకం, స్వామి వారి కల్యాణం వైఖానస ఆగమ ప్రవర దివి వెంకట శేషాచార్యుల వారి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు, స్వామివారి అలంకరణ శ్రీనివాసుల కృష్ణమాచార్యులు చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు. అర్చకులు నారాయణం రాజశేఖరాచార్యులు తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు తెలిపారు.

పశుపోషకులకు రాయితీపై దాణా



రాయితీపై దాణా పంపిణీ చేస్తున్న జేడీ డాక్టర్ బేబీ రాణి

- జేడీ డాక్టర్ బేబీ రాణి

సంతనూతలపాడు: పశుపోషకులకు రాయితీపై ఇస్తున్న దాణాను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బేబి రాణి పేర్కొన్నారు. సంతనూతలపాడులోని పశువుల ఆసుపత్రి వద్ద మంగళవారం 50 శాతం రాయితీపై దాణాను పశుపోషకులకు ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా జేడీ మాట్లాడుతూ.. 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పశువుల దాణాను పశుపోషకులు సద్వినియోగం చేసువాలని ఆమె కోరారు. ఈ దాణాలో 25% మాంసకృతులు ఉంటాయని వివరించారు. వేసవిలో వీటి ద్వారా పాల దిగుబడి, వెన్నశాతం తగ్గకుండా ఆర్థికంగా వెసువుబాటు కల్పిస్తుందని ఆమె వెల్లడించారు. పశుపోషకులు ముఖ్యంగా మొదటిగా 80 శాతం రాయితీతో పశువులు, ఆవులకు, బీమా చేయించుకోవాలని ఆమె కోరారు.

బీమాతో ఉపయోగాలు..

ప్రభుత్వ రాయితీ పోను మూడేళ్ల కాలానికి కేవలం పశుపోషకులు రూ.30 వేల విలువ చేసే పశువుకు కేవలం రూ.288 మాత్రమే రైతు చెల్లించాలన్నారు. ఇన్సూరెన్స్ ద్వారా పశువులు, ఆవులకు, ఎంతో రక్షణ అని ఆమె పేర్కొన్నారు. దాణాకు ముందుగా పశుపోషకులు తమ గేదెలు, ఆవులకు, 85 శాతం రాయితీతో ప్రభుత్వం కల్పిస్తున్న బీమా చేయించుకోవాలన్నారు. అదేవిధంగా గొర్రెలు, మేకలకు, మూడు సంవత్సరాల కాలపరిమితికి సంబంధించి ప్రభుత్వ రాయితీ పోను కేవలం రూ.56 మాత్రమే చెల్లించి బీమాను పొందాలని పోషకులకు ఆమె విజ్ఞప్తి చేశారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పశు పోషకులు 50 కిలోల దాణా రూ.1110 ఉండగా 50% రాయితీ పోను కేవలం రూ.555 మాత్రమే పశుపోషకులు చెల్లించాలన్నారు. కిలో దాణా రూ.11 మాత్రమే ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ఒక్కొక్క రైతుకు నెలకు 150 కిలోల వంతున మూడు నెలలకు 450 కిలోల 50% రాయితీపై నాణ్యమైన సమీకృతమైన దాణా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జిల్లాకు మొదటి విడత కింద 250 మెట్రిక్ టన్నులు దాణాను ప్రభుత్వం కేటాయించినట్టు ఆమె తెలిపారు. జిల్లాలో ప్రతి మండలానికి 6.5 మెట్రిక్ టన్నుల దాణాను ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు జేడీ వెల్లడించారు. దాణా కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం, పశు వైద్య శాఖ కార్యాలయంలో పశు పోషకులు వీటిని నమోదు చేసుకొని పొందాలన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు పశువైద్యాధికారి డాక్టర్ బీ ప్రతాప్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఒంగోలు సబర్బన్: పిడుగుపాటుకు గురై మృతి చెందిన కుటుంబానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చెక్కులు అందించారు. మండలంలోని పెద్ద దేవరంపాడు గ్రామంలో మృతురాలు నూకసాని శిరీష భర్త వడ్లమూడి వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం తరుపున రూ.4, లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చిందని డీఆర్‌ఓ ఓబులేసు చెప్పారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, ఒంగోలు మేయర్ గంగడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వర్లు బాధిత కుటుంబానికి చెక్కు అందించారు.

వేసవి శిక్షణ తరగతుల పరిశీలన



విద్యార్థులతో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు విద్యాభివృద్ధిపై జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి పలు సూచనలు ఇచ్చారు. ఈశిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులు మరింతగా రాణించాలని ఆమె కోరారు. ఎండల్లో విద్యార్థులు బయట తిరగవద్దని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధించి మంచి పుస్తకాలను అందుబాటులో ఉంచాలని జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి గ్రంథపాలకుడు కే సత్యనారాయణకు ఆదేశాలు ఇచ్చారు. గ్రంథాలయానికి సంబంధించి రికార్డును ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర ఆరాధన మహోత్సవం

తర్లుపాడు: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ అమ్మవార్ల ఆరాధన మహోత్సవాలు తర్లుపాడులో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పంచామృతాభిషేకం, గణపతి పూజ, పున్యహవచనం, మండపారాధన నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివారి కల్యాణం కనుల పండువగా సాగింది. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

కలెక్టరేట్ ఎదురుగా అంబేడ్కర్ నాటకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘురాం

ఒంగోలు టౌన్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన సంఘం శరణం గచ్ఛామి సంస్థ ఈ నెల 8వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రదర్శిస్తున్న అంబేడ్కర్ నాటకాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురాం పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఎల్బీజీ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అలాగే 9వ తేదిన మద్దిపాడు కళాకేంద్రం వద్ద నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సామాజిక విప్లవకారుడు అంబేడ్కర్ జీవితాన్ని ప్రజలందరికీ దగ్గర చేసేందుకు చైతన్య ఉత్సవాల పేరిట నాటకాలను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. అంబేడ్కర్ కలలుగన్న సమసమాజ నిర్మాణం కోసం, మతాలకతీతంగా భీమ్‌రావును ప్రతి ఇంటికి పరిచయం చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. ఏప్రిల్ 22న కర్నూలు జిల్లా నుంచి ప్రారంభమైన ఈ జ్ఞాన యుద్ధం రాష్ట్ర మంతటా నెల రోజుల పాటు జరుగుతుందని, విజయవాడ ప్రదర్శనతో ముగిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సామాజిక ఉద్యమంలో భాగం పంచుకోవాలని కోరారు. సమావేశంలో అట్లూరి రాఘవరావు, మోజేష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారికి లక్షమల్లెల పూజ



పూజలు అందుకుంటున్న అమ్మవారు

సంతనూతలపాడు: వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి పురస్కరించుకొని అమ్మవారికి లక్ష మల్లెల పూజ నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రం సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద వేడుకలు జరిగాయి. ఆలయ అర్చకులు నేలపట్ల శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాదర్తి వెంకట సతీష్ కుమార్, వెంకట ప్రసన్న నాగ దీప్తి దంపతులు కూర్చున్నారు. ఈనెల 7న బుధవారం ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమ పూజలు జరగనున్నాయి. మధ్యాహ్నం శిఘాకొల్లి పాండురంగారావు, అనసూయ దంపతులు వారి కుమారులైన సుందరేశ్వర్, రాధాకృష్ణ ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నసంతర్పణ చేయనున్నారు. రాత్రి ఆర్యవైశ్య మహిళలచే అమ్మవారికి గ్రామోత్సవం, అదేవిధంగా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామం సారంగి ఎల్లయ్య వీరముష్టి బృందం ఆధ్వర్యంలో ప్రభ, దండకాలు, వీరంగం కార్యక్రమాలు జరగనున్నాయి. ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు వేమా మల్లేశ్వరరావు, సెక్రెటరీ పబ్బిశెట్టి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు శిఘాకొల్లి సత్యనారాయణ, కోశాధికారి వేమా చిన వెంకట కృష్ణారావు, కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. లక్ష మల్లెల పూజా వేడుకల్లో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం బాగుంది..



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న ఢిల్లీ ప్రతినిధులు

కొత్తపట్నం: 'ఇక్కడ ప్రకృతి వ్యవసాయం బాగుంది.. మా ప్రాంతంలో ఇక్కడి పద్ధతులను ఆదర్శంగా తీసుకుంటామని' ఢిల్లీ బృంద సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ఇమాగో గ్లోబల్ గ్రాస్ రూట్స్ ఢిల్లీ నుంచి వచ్చిన వివేక్ అతుల్ బృందం మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేస్తున్న పంట పొలాలను పరిశీలించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో రంగాయపాలెం గ్రామంలో కాట యమునా సురేంద్ర వేరుశనగ పంటలో ఏ గ్రేడ్ మోడల్‌లో వేసిన అరటి, బొప్పాయి, మునగ, నిమ్మ పంటలను పరిశీలించారు. అదే విధంగా కొత్తపట్నం గ్రామంలో జ్యోతి, బాలకోటయ్య సాగు చేసిన పలు రకాల ఆకు కూరలు పంటలను పరిశీలించారు. పురిణి మల్లేశ్వరి ద్వారా నిర్వహించే ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రాన్ని సందర్శించి కషాయాలు, ద్రావణాలు తయారీ విధానం, నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. వజ్జిరెడ్డిపాలెం గ్రామంలో చిన్న వెంకటేశ్వరరెడ్డి నవధాన్యాల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, రెడ్డప్ప, పిట్టు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు

వేడుకగా శివపార్వతుల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణం, శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా నగరంశెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. బుధవారం నంది సేవ, గురువారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సీతా నవమి వేడుకలు



సీతానవమి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మార్కాపురం: పట్టణంలో నెహ్రూ బజారులో పాండు రంగ స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సీతా నవమి వేడుకలు (సీతా దేవి పుట్టిన రోజు) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి మహిళ సీతా మాతను ఆదర్శంగా తీసుకోవాలని, కుటుంబ విలువలు కాపాడాలని కోరారు. వీహెచ్‌పీ జిల్లా దుర్గా వాహిని జి.అపర్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటక వనజాక్షి, జి.వరలక్ష్మమ్మ, ప్రసన్న, లావణ్య, శాసనాల సరోజిని, పి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొమరోలు: మండలంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఎస్సీ యాక్షన్ ప్లాన్ ద్వారా మంజూరైన రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మస్తాన్‌వలి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికిగాను మండలానికి ఎస్సీ రుణాలు మంజూరయ్యాయని, అర్హత కలిగిన వారు 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.